# అదురుష్టం

నేను యింకా నిద్దర పడకమిందనే ఉండా. మా యింటికి పది యిర్వై గడపలకు 'ఎగుదాల కిష్ణగుడి. ఆ గుళ్లో లవుడ్స్పీకర్లో గంటసాల గీతాసారాన్ని ముంతలతో ముంచెత్తి పోస్తా వుండాడు. ఇంట్లో మాబాశాలి సంసార సారాన్ని వడగట్తా ఉండాది. పొయ్యిలో ఉప్పుపోసి శాట అడ్డం పెట్టి నట్టుండాది కత. ఇంక లేస్తే ఎట్నో లెయ్‌కుండాపోతే ఎట్నో అని నాలో నేనే మల్ల గుల్లాలు పడ్తా పడకను కూరాడ్తా వుండా. మొకాన్ని మట మట మాడ్చుకుంటా మాబాశాలి యిల్లంతా పొరాడ్తా ఉండాది.

''ఎప్పుడబ్బా ఈ కొంపలో నిమ్మతిగా పొణుకోని నిదానంగా నిద్దర లెయ్యబొయ్యేది. పొణుకుంటా ఉంటే ఒక బారతం... నిద్దర లేస్తా ఉంటే ఒక రామాయిణం. యిదొక బతుకా? బతుక్కు పట్నెపీడా. దమ్మిడికి పనికిరాని నాయాండ్లంతా వాళ్లకు మించిన మొనగాళ్లే లేరంటా బతికిపోతా ఉంటే ఈ దేశింలో చెంబుకు నామాలు పెట్టుకుంటే బతకలేకుండా పోతామా?''

నా యాష్ట నాదిగా ఉండాది.

''పొద్దుగూకులూ కొంపలో పడుండేది. పొద్దు గూట్లో పడ్తానే ఎలబారేది. ఏ యదవ ఉచ్చు గొంతులో పోస్తాడా? అని దేబిరించుకుంటా తిరిగేది. ఎవుడో వొకడు ఆ ఎచ్చులమారోడు రామ్మూర్తి మాదిర వొకడు దొరక్కుండా పోతాడా? పూట గడుపు కుండేది. తెయ్యాలుదొబ్బే యాళకాడ కొంపకొచ్చేది. నీస్తే అంతగతికేది. నీసకుండాబోతే గమ్మునపాయ్ పొణుకుండేది. కుంబకర్నుడి మాదిర్తో గురక బెట్టేది. పన్నెండు గెంట్ల కాడ ఆ గెడారం ముండ్లకు ఉండేబుద్ది కొంపలో ఈ మొగోడికుంటే. పోనీలే! వ్రతం సెన్నా సుకం దక్కిందనుకోవచ్చు. అదీలే. సుద్దంగా కాళ్లుచాపేసిన బతుకు. ఈ బతుకు బతికే దానికంటే బండకట్టుకోని బాయిలో దూకొచ్చు!'' ఆపె యాష్ట ఆపెదిగా ఉండాది.

అదెంతా అట్ట పోనీకానీ పన్నెండు గెంట్లకాడ గెడియారం ముండ్లకుండే బుద్ది ఏం దబ్బా? అని ఆలోశన్లో పడ్తి.

మణుసును అట్టాయిట్టా పోనీకుండా మంచి సోదీనంలో పెట్టుకోని గెడారాన్ని కండ్ల ముందుకు తెచ్చుకోని గుస్టినంతా పన్నెండుగెంట్ల కాడ నిలబెట్తి. ముల్లు మింద ముల్లు ఎక్కుండాది! నా యాష్టఎట్టపొయ్యిందో పొయ్యింది. ముసిముసి నవ్వుల్తో మొకం పూసిన మల్లెచెట్టే అయ్యింది.

''ఈ బతుక్కి మల్లా నవ్వు గూడానా? సిగ్గు లేకుండాబోతే సరి. లెయ్. లేసి నీ ముద్దుల కూతురు ఏం చేసిందో చూడు?''

ఆ మాటతోగూడా ఎగిరట్టా పణ్ణా. ఏం చెయ్యాల మల్లా? కాలం ఎట్టుండాదని? కొంపలో ఆడపిలకాయిల్ను పెట్టుకోని బతికేదంటే మాట్లా? గుండెల మింద కుంపిటి పెట్టుకోని బతికినట్టేగదా? ఊళ్లో జరగతావుండే వొక్కొక్క కత యింటావుంటే గుండికాయి జల్లుమంటింది!

ఆ బిడ్డను చూసి ఆడబిడ్డంటే యిట్లుండాల అనుకుంటా ఉంటి!

పచ్చి పాసుపు గొమ్ము. కంతిరీగె నడుము. మోకాళ్లను తాకాలని మునాస పడ్తా జడ. దోవన నడస్తా ఉంటే ఆ నడక?– అందురి చూపులూ ఆ పిల్లమిందే! ఆ పిల్లదాని చూపులేమో దోవమింద. అంతా కాట్పాడి గుర్రం కతే. అట్టాయిట్టా చూసే పస్లే. కాట్పాడిలో యిడ్సిపెడ్తే నేరుగా వేలూర్లో పాయ్ పడేదే!

ఒక దినం గాచ్చారం చాలకుండా ఆబిడ్డ మాట మా బాశాల్తో చెప్పి ఆడబిడ్డంటే అట్టుండాలని మెచ్చుకుంటి.

''అవునవునే! నీ తలకాయ. దాని కత నీకేంతెల్సు? ఆ నంగనాచి టంగుబుర్ర ప్రేమలో పడింది. అదిగూడా ఎవుర్తో? పెండ్లయి పాయ్‌న వాడ్తో. ఇప్పుడందురూ ఉడ్డ కూసోని యాడస్తా దాని గెడ్డం కింద రొండు వడ్ల గింజిలేసి అడుక్కుంటా ఉంటే ముడుక్కుంటా ఉండాది'' అంటా మూతి ముప్పైఆరు తిప్పులు తిప్పె.

''ఏమీ ఎరగనట్టే ఎంత కంతిరీ పని చేసింది. ఏపుట్టలో ఏ పావు ఉండాదోఎవురికి ఎరికిరా నా తండ్రీ!'' అని ఆపొద్దు అనుకుణ్ణా.

ఈపొద్దు నిద్దర లేస్తానే ఎవురి మొకం చూసినానో ఏం పాడో? ఏమి యినరాని మాట యినాల్సి వస్తుందో? అనుకుంటా లేచే కుందికి–

''నీ కూతురు చేసిన నిర్వాకం చూడు.'' అంటా మా బాశాలి వొక కట్ట కాగితాలు తెచ్చి నా మొకాన కొట్టబాయ.

ఆ కట్ట కంటబడే కుందికి వొళ్లంతా చెమట్లు పట్టేసె. గుండికాయి కొట్టుకుండేది గెంట కొట్టినట్టు యినిపిస్తా ఉండాది. అదర్తా బెదర్తానే ఆకట్ట చేతికి అందుకుణ్ణా. ఈబిడ్డ యింత పనికి వొగతెగిస్తిందని కల్లోకూడా అనుకో లేదే? అనుకుంటా కట్ట పైన ఉండే కాగితాన్ని యిప్పదీసినా.

అన్నీ తెలుగు లచ్చిమి లాట్రీ టికట్లు!

''ఒసే! నీ బయిశారా! దీనికేనా గుండ్రాయి ఎత్తుకోని రొమ్ము గుద్దుకుణ్ణెంత పని చేసింది?'' అన్నెట్టు ఆపెకల్లా చూస్తా ఉంటే–

''దిగులుపణ్ణె కోడి తిన్నెమింద ముడుక్కోని ఉంటే పొగురు పట్నె కోడి పాయ్ పాటిక్ పాటిక్ మని పొడ్సిందంట. అట్టుండాయి గదే ఆ చూపులు. ఆ చూపుల్లో అగ్గిబడి పోనానీ! సంసారి కైతే సంసారం అంటే ఏందో తెలిస్తింది. దమ్మిణ్ణి రూపాయిగా చూస్తా వుంటేనే దారకం దొరికేది ఆడికాడి కుండాది. అందురి మాదిర్తో ఆడేటిగా ఉంటేనా? మల్లా ఏంలే! లాట్రీ కొట్టాల్సిందే. అది తెల్సుకోని బతకండమ్మా? అని చిలక్కు చెప్పినట్టు

చెప్తా ఉంటే మల్లాపాయ్ ఈబిడ్డ యిన్ని లాట్రీ టికట్లు కొంటావుంటే యింక నేనేడబొయ్ చావాల?''

''ఆ బిడ్డ చేతికి అన్ని దుడ్లు యాణ్ణుంచి వచ్చినాయి? – యిన్ని టికట్లు కొనుక్కుండే దానికి?''

''ఇస్తా ఉండ్లా నేను. నిద్దర లేస్తానే ఏది తప్పినా అది తప్పితిందా? దినమ్మ మార్కెట్టుకు పాయ్ రావద్దా? నేనేమన్నా ఆ మార్కెట్టు కాడికి పాయ్ యిదెంత అదెంత అని ఆరా తీసి ఆరళ్లు పెడ్తా ఉండానా? చెప్పిందానికి తలూస్తా. రూకాఅడ్డగా మిగలబెట్టు కుండేది. రొండుమూడు దినాలు చేర్సి పెట్టేది. ఇట్టా తగలబెట్టేది. ఒక తినిన పాడా? ఒక కుడ్సిన పాడా? మొగెదవ చూస్తే అట్టా! పిలకాయలు చూడబోతే యిట్టా! ఎట్ట ఏగులాడేదో ఏంపాడో?''

''అదురుష్టం ఉండి లాట్రీ కొడ్తే...''

''అయ్యు! అయ్యు! అబ్బా కూతుళ్ల అదురుష్టమా? ఏడు బండ్లకు ఎత్తితే కూడా యింకా రోంత మిగిల్తింది ఎనిమిదో బండికి!''

సంసారమంతా ఆపె అదురుష్టం మిందనే సాగతా ఉణ్ణెట్టు... ఆపె మెళ్లో తాళికట్నాకనే నేనొక మణిసి అయినట్టు ఆపె మణుసులో బాగా నాటుకోని పొయ్యుండాది.

అటుమంటి వాళ్లతో వాదులాడ్తే ఏంలాబం? అందుకే ఆడికి యిడ్సి పెట్టేసినా. నాకత నేను ముగించుకోని నా దోవన నేను ఎలబార్నా.

నేను ఎగబడి నాలుగ్గాళ్లమండపం కల్లా పోతా ఉండా. ఒకరిక్సా దిగబడి నాకు ఎదురుంగా వస్తా ఉండాది.

''తెలుగు లచ్చిమి లాట్రీ!... రేపే... రేపే డ్రా!... టిక్కట్టు వెల రొండు రూపాయిలే!... రొండు రూపాయిల్తో పది లచ్చలు!... రండి ఆలసించిన ఆశాబంగం... మీ అదురుష్టాన్ని నేడే పరీచ్చించుకోండి!'' వాడు ఊదరకొట్తా ఉంటే చెవులు తూట్లు పడ్తా ఉండాయ్!

అయినా వాడి మాటలు యింటా వుంటే పెద్దోళ్లకే మణుసు మెర మెర అంటా వుంటే యింక పిలకాయిల కత యేరేగా చెప్పాల్నా? –

పాపం! ఆ బిడ్డ నమ్ముకోని ఉంటిందో రొండురూపాయిల్తో పది లచ్చలుగానా వొచ్చేస్తే– రొండు గాకపోతే నాలుగు లచ్చలు యిసిరి పారేస్తే ఆడది వంచాల్సిన తలకాయి మొగోడే వంచేస్తాడు. తాళిబొట్టు చేతబట్టుకోని నిలబడ్తాడు. ఇష్టం వచ్చినప్పుడు తలపైకెత్తి క్ర్టా బొట్టు యదవా! అంటే కట్టేస్తాడు. ఇంకొక లచ్చ డొనేషన్ యిసిరట్టా పారేస్తే చెల్లికి మెడికల్లో సీటు యిచ్చేస్తారు. మల్లేం వుండాది? దాని బతుకు అది బతికేస్తింది. ఇట్టా మాదిర ఆలోచించుకుంటా ఆ బిడ్డ పావలా పరక కూడేసి కూడేసి లాట్రీ టిక్కట్లు కొనుక్కోని ఉంటింది. దాన్ని అర్తం చేసుకోకుండా ఎగిరెగిరి పడ్తే ఎట్టా?

ఎవురి అదురుష్టం ఎట్టుండాదో ఎవురు చూసేసొచ్చినారు?

అదురుష్టం మాట అనుకుండే కుందికి నా మణుసు మహన్నబావుడు బుడ్డా వెంగళ్‌రెడ్డి మిందికి పాయ.

కర్ణుడు చేసిన దానాల్ను గురించి మనం కతలు కతలుగా యిన్నాం. ఈ కలికాలంలో కూడా కుడి ఎడమలకు తేడా తెలవకుండా దానాలు చేసి మల్లా అంత పేరు తెచ్చుకున్న దరమాత్తుడు బుడ్డా వెంగళ్‌రెడ్డి.

బుడ్డా వెంగళ్‌రెడ్డిది ఉయ్యాలవాడ. ఉయ్యాలవాడ ఉండేది కర్నూలు జిల్లా కోవెలకుంట్ల తాలూకాలో!

వెంగళ్‌రెడ్డి తల్లి వెంకటమ్మ. ఆ తల్లికి ప్రెతేకించి పనీపాటా ఏమీలే. తట్టలోనో గంపలోనో గింజిలు పోసుకుండేది. ఇంటి ముందర కూసుండేది. వాకిట్లోకొచ్చిన బిచ్చగాళ్లకు వాళ్ల వాటంవైనం చూసి శారల్లతో పెట్టేవాళ్లకు శారల్లతో, శాటల్తో పెట్టేవాళ్లకు శాటల్తో పెట్టావుండేదే పని. అన్నం అడిగినోళ్లకు అన్నం, మజ్జిగ అడిగినోళ్లకు మజ్జిగ- అడగనోడే పాపాత్తుడు. నోరు తెర్సి అడిగితే లేదనే పనేలే. అట్ట పుట్నిల్లు- యిట్ట మెట్నిల్లు- రొండూ కలిగిన యిండ్లే. ఎమికలేని చెయ్యి. ఇంక అడ్డమేముంటింది? -

తల్లి చాలు బొల్లి పిల్ల అంటారు గదా? ఆ తల్లిచాలే వచ్చింది వెంగళ్‌రెడ్డికి కూడా! డొక్కల కరువులో రెడ్డి పేరు నీళ్ల కవతల దాకా పాకి పొయ్యింది.

ఇప్పటికి సరిగ్గా నూట యిర్వై రొండేండ్లప్పటి మాట. 1866 అక్షయనామ సమ్మత్సరం. డొక్కల కరువు వచ్చింది. ఆ ముందుటి సమ్మత్సరం క్రోదనలో గూడా వానలు లే. వర్సగా రెండేండ్లు వానలు లేకుండా పొయ్యేకుందికి యింకేం వుండాది? చెరువులు ఎండిపాయ. గుంటలు ఎండిపాయ. వాగులు ఎండిపాయ. తాగేదానికి నీళ్లు లేకుండా... తినేదానికి తిండి లేకుండా... గొడ్లకు పిడికిడు మేపులేకుండా ప్రెజలు 'అలో రామసెంద్రా' అని అల్లాడి పొయ్‌నారంట! బలసాకు తిని రొన్నాళ్లూ... కలబంద గెడ్డలు తిని కొన్నాళ్లూ... నల్ల రేగడి మట్టిలో పెరుగు కలుపుకోని తిని రొన్నాళ్లూ... యిట్టా మాదిర ఎన్నాళ్లని బతకతారు?

ఎవుడైనా కడుపునిండా తిన్నోడు కనిపిస్తే ఆకిలికి తట్టుకోలేకుండా వాడి డొక్కల్ను చీల్సి అయినా ఆ కడుపులో ఉండే కూడు తినాలని తపించి పొయ్‌నారంట. అందుకే అది డొక్కల కరువయింది.

ఆ కరువులో ముక్కెంగా బళ్లారి అనంతపురం చిత్తూరు జిల్లాల వాళ్లు కొసురుగా కర్నూలు జిల్లాలో పత్తికొండ తాలూకావాళ్లు ఉడ్డలుడ్డలుగా వచ్చి వెంగళ్‌రెడ్డి మింద పణ్ణారంట. పడ్తే ఏముండాది? ఎనుకూ ముందు చూసే జల్మంగాదే!... పుట్లకు పుట్ల దాన్నెం వండించి వడ్డించినాడంట. ఇంట్లో యిరుపు ఉణ్ణె వందల పుట్ల దాన్నెం ఒక చుట్టుకు చాలక పాయనంట. చాలక పొయ్యిందని చాలించుకుణ్ణాడా మహన్నబావుడు! లేదే? వందల పుట్లు కొనుగోలు చేసినాడంట. ఉరామరిగ్గా పూట పూటకు ఎనిమిది వేల మందికి తక్కువ

గాకుండా రొండున్నర సమ్మత్సరం ఆయన చేతి కూడు కుడ్సి ఆ కరువులో పాణాలు నిలబెట్టు కుణ్ణారంట! వండి వార్సి వచ్చినోళ్లకు పెట్టించిన కుమ్మర రంగన్న కుడిచేతికి బంగారు కడిమే తొడిగినాడంట!

ఇప్పటికీ కడపలో రైలెక్కి గుత్తిమింద గుంతకల్లు దాకనో యింకా ఆ పైదాకానో పోతావుంటే రైల్లో బిచ్చగాళ్లు అడుక్కుంటా ఆ మహన్నబావుడి మింద పాటలుగట్టి పాడాతా ఉంటారు.

*ఉత్తరాది ఉయ్యాల వాడలో*
*ఉన్నది దర్మము సూడరయా!*
*నేటికి బుడ్డా ఎంగలరెడ్డీ*
*దర్మ ప్రెబువనీ పాడరయా!*
*దానకర్ణుడూ ఎంగలరెడ్డీ*
*దర్మాత్ముండయ్యా*
*పచ్చి కర్వులో పానము బోసిన*
*బెమ్మదేవుడే ఆయనయా!*
*కుంటివాళ్లకూ గుడ్డివాళ్లకూ*
*గుర్తుగ బండ్లు సేయించెనయా!*
*నేటికీ బుడ్డా ఎంగలరెడ్డీ*
*దర్మ ప్రెబువనీ సాటరయా!*

ఈ పాట యింటా వుంటే మణుసు ఎట్టెట్నో పోతింది. ఇటుమంటి పుణ్ణాత్తులూ ఉండారు. ఎవుడిదో పావలాబిళ్ల పెంటమింద పడివుణ్ణా ఎత్తుకోని జేబీలో ఏసుకుండే మహన్నబావులూ ఉండారు.

సరే! కరువులో యింతమంది పాణాల్ను కాపాడిన పుణ్ణాత్తుడి మాట ఈ చెవులో ఆ చెవులో పడ్తా నీళ్లకు అవతలవుండే విక్టోరియా రాణెమ్మ చెవల్లో పాయ్‌పడిందంట. ఆయమ్మ అట్నే చలించి పాయిందంట. సర్కారోళ్లు చెయ్యలేని పని ఒక సాదా సీదా రైతు చేసినాడంటే మాట్లా? రెడ్డిని ఆగమేగాల మింద డిల్లీకి పిలిపించిందంట. అప్పట్లోనే ఆరువేలు చేసే బంగారు పతకాన్ని రెడ్డి సందిటగట్టి సన్మానం చెయ్యించిందంట!

ఇట్టా మాదిర చెప్పుకోవాలంటే ఆయన కతలు శానా శానా ఉండాయి!

అయితే ఆయన అన్నిందాలా ఉడిగిపాయ్‌న కాలాన ఎవురో ఒక బాపనాయన ఆయనతావుకు వచ్చినాడంట.

''రెడ్డీ! ఎన్నో దానాలు చేసినావు. దర్మాలు చేసినావు. డొక్కల కరువులో లెక్కలేనంత మందికి దారకం పోసి పాణాలు నిలబెట్నావు. మీ మింద కొండంత నమ్మకం పెట్టుకోని వస్తిని. నా కొడుక్కు ఉపనయనం చెయ్యాల. మీ సహాయం కావాల రెడ్డీ!'' అని అడిగినాడంట.

రెడ్డి రొండురూపాయిలు తీసి యియ్య పాయ్‌నాడంట.

''అర్ధ నూట మదహోర్లన్నా దొరకతాయని ఆశ పెట్టుకోని వస్తినే! ఈ రొండు రూపాయిల్తో ఏమయితింది?''

''ఇప్పటి నా పరిస్తితిలో యింతకు మించి చెయ్యలేనయ్యా!'' అని రెడ్డిగారు ఎట్టెట్నో చెప్పి చూసినాడంట.

అయినా ఆ బాపనయ్య యినిపించుకోలేదంట!

అప్పుడు ఏం చెయ్యాల? రెడ్డి ఒక్క సెణం ఆలోచించినాడు. నేరుగా లోపలికి పాయ్‌నాడు.

అర్ధ నూట పదహోర్లు గారంటీగా చేతిలో పడేది కాయమని బాపనయ్య ఎదురు చూస్తా ఉండాడు.

రెడ్డి రొండు చేతల్లో రొండు పళ్లు పట్టుకోని వచ్చినాడు. వాటి నిండికి జొన్నలుండాయి. ఆ రొండు పళ్లను బాపనయ్య ముందు పెట్నాడు. బాపనయ్య వాటికల్లా అయోమయంగా చూస్తా ఉంటే-

''అయ్యా! ఈ రొండు పళ్లల్లో ఒక దాంట్లో రొండు రాపాయిలుండాయి. ఇంకొక దాంట్లో యాభైరూపాయిల యిలవ చేసే బంగారు నగ ఉండాది. నీకు యిష్టమయింది తీసుకో!'' అన్నాడంట.

ఆ బాపనయ్య మణుసులో దేముణ్ణి తల్సుకోని ఒకపడి తీసుకున్నాడంట. దాంట్లో రొండు రూపాయిలే ఉణ్ణాయంట!

అదురుష్టమంటే యిట్నే ఉంటిందేమో అనుకుంటా నాలుగ్గాళ్లమండపం కాడికి వచ్చేకుందికి ముత్తారెడ్డన్న ఎదురుపడె.

''ఏమిరా అబ్బోడా సంగతి?'' అని అడిగితే-

ఏముండాదన్నా అంటా వెంగళ్‌రెడ్డి కత చెప్తి.

''ఒరే అబ్బోడా! వెంగళ్‌రెడ్డి ఎంతో యిచ్చినోడు. ఆ బాపనయ్యకు యియ్యాల అనుకోనుంటే యాభైరూపాయిల సొత్తు యిచ్చేది ఒక లెక్క కాదు. అయినా పరీచ్చపెట్టె. పాపం! ఆ బాపనయ్యకు ఏ పళ్లో ఏమి ఉండాదో తెల్దు. కానీ మనకత అట్లాకాక పాయనే. ఒకచేతిలో కాంగ్రెస్. ఇంకొకచేతిలో తెలుగుదేశం పట్టుకుంటిమి. ఏ చేతిలో ఏమి ఉండాదో మనకు తెల్సు. మన యిష్ట పకారమే మనం చేసుకోని ఉండచ్చు. అయినా అదురుష్టాన్ని మనమే పరీచ్చకు పెట్టిమి. ఇన్ని దినాలుగా కాంగ్రెసోళ్లు పాడ్సి గెల్సిందేమని తెలుగుదేశాన్ని ఎన్నుకుంటిమి. ఇప్పుడు మన అదురుష్టం యాడికి ఏడస్తా ఉండాదో తెలస్తానే ఉండ్లా!''

తలపగలగొట్టుకుండే దానికి ఏ రాయి అయితే ఏముండాదిలే? అనుకుంటి.●